సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 3 । జూన్ । 2024


మైనర్లే నిందితులు 10లో


భద్రత కట్టుదిట్టం 8లో


పిడుగుల వాన 8లో

176 నిఘా నేత్రాలు
645 మంది రక్షకులు



COUNT DOWN @ 24 HOURS


ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వాహనాన్ని ఆపి వివరాలు అడుగుతున్న పోలీసులు

- రెడ్ జోన్‌గా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల
- 144 సెక్షన్ అమలు
- మూడంచెల భద్రత ఏర్పాటు
- ఒక ఏపీఎస్‌పీ.. రెండు సీఆర్‌పీఎఫ్ దళాలు
- జిల్లా వ్యాప్తంగా 2500 మంది పోలీసులతో బందోబస్తు
- 5 గురు ఏసీపీలు, 10 మంది సీఐలు
- సమస్యాత్మక ప్రాంతాలు 91
- 650 మంది రౌడీ షీటర్ల హౌస్ అరెస్టు
- 79 మంది పెట్రోలింగ్ పార్టీల ఏర్పాటు
- 4 ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు
- కౌంటింగ్ పరిసర ప్రాంతాల్లో మరింత నిఘా
- 137 పికెట్స్ ఏర్పాటు
- 16 ఎకరాల ఏయూ గ్రౌండ్‌లో పార్కింగ్
- కౌంటింగ్ ప్రవేశం వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష
- ఈస్ట్, నార్త్, సౌత్ మద్దిలపాలెం నుంచి...
- గాజువాక, పెందుర్తి, పశ్చిమ త్రీటౌన్ వైపు నుంచి ప్రవేశం
- అభ్యర్థులకు, పార్టీ కార్యాలయాల వద్ద భద్రత

- కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- 84 మంది సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్
- 60 మంది ఏపీఎస్‌పీలతో 9 యాక్సిస్ కంట్రోల్ పాయింట్లు
- భద్రత కోసం 501 మంది సివిల్ పోలీస్ ఫోర్స్ వినియోగం
- ప్రతి అణువూ పర్యవేక్షించేలా 176 సీసీ కెమెరాలు

విశాఖ పార్లమెంట్ పరిధిలో కౌంటింగ్ కేంద్రాలు	7
అసెంబ్లీ పరిధిలో	7
పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలు	6
ఈటీపీబీఎస్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు	1
కౌంటింగ్ సూపర్‌వైజర్లు	267 మంది
కౌంటింగ్ అసిస్టెంట్లు	309 మంది

సాక్షి, విశాఖపట్నం : కౌంటింగ్‌కు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. సీసీ కెమెరాలు, డ్రోన్లు, బాడీ వార్న్ కెమెరాలు, పోలీసు నిఘా నీడన మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు పోలీస్ బాస్ డా.రవిశంకర్ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రమైన ఆంధ్ర విశ్వవిద్యాలయం వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తూనే మరో వైపు జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రశాంత వాతావరణంలో లెక్కింపు జరిగేందుకు ప్రజలు,అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని పోలీసు అధికారులు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర బలగాలు, ఏపీఎస్పీతో పాటు స్థానిక పోలీసు అధికారులు సుమారు 645 మందికి పైగా సిబ్బంది అక్కడ బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు. కేంద్ర బలగాలను గార్డులుగా విభజించి.. ఒక్కో గార్డులో ఆరుగురు సీఏపీఎఫ్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా ఐదుగురు సిబ్బందితో స్పెషల్ ఆర్మ్‌డ్ పోలీస్ (ఎస్‌ఏపీ) బృందాన్ని ఒక గార్డుగా నియమించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు వీడియో గ్రాఫర్‌ను నియమిస్తున్నారు. ప్రతి అంశం కెమెరాలో నిక్షిప్తం అయ్యేలా చర్యలు చేపట్టారు. ప్రధాన గేట్ల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు, కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే లోనికి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. మహిళల కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు.

రెడ్ జోన్‌గా ప్రకటన

కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్‌లను అమలు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రంతో పాటు రెండు కిలోమీటర్ల పరిధి వరకు రెడ్ జోన్ ప్రకటించారు. లెక్కింపు కేంద్రాల్ని నో ఫ్లై జోన్‌గా ప్రకటించారు. డ్రోన్లు, బెలూన్లు ఎగరవేయడం నిషేధించారు. కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులు, ఏజెంట్లు, అభ్యర్థులకు జిల్లా ఎన్నికల అధికారి లేదా ఎన్నికల కమిషన్ ఇచ్చిన పాస్ ఉంటేనే హాల్లోకి అనుమతిస్తారు. రిటర్నింగ్ అధికారులు మినహా ఇతరు లెవరూ కౌంటింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు వీలులేదు. కౌంటింగ్ సిబ్బంది. ఏజెంట్లు కేంద్రం బయట ఏర్పాటు చేసే డిపాజిట్ కేంద్రంలో సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అప్పగించాలి. లేదా వారి వాహనాల్లోనే భద్రపరచుకోవాలి.

అభ్యర్థులకు భద్రత

ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అభ్యర్థుల ఇళ్లు, పార్టీ కార్యాలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. అభ్యర్థులకు భద్రతను పెంచేలా చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్పులు నిషేధించారు. ఎన్నికల వేళ అల్లర్లకు పాల్పడినా..ఎంసీసీ ఉల్లంఘించినా చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలు లేకపోయినా కొన్ని ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచారు. వాటితో పాటుగా నగరంలోని ప్రధాన కూడళ్లు, సరిహద్దుల్లో పోలీసు పికెట్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో మొబైల్ పార్టీలను ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసు అధికారులు ఆయా ప్రాంతాల్లో రౌండ్ ది క్లాక్ గస్తీ నిర్వహిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మంగ్లర్స్‌పై ఇప్పటికే బైండోవర్లు నమోదు చేశారు. వారి కదలికలపై గట్టి నిఘా ఉంచారు.


ఏయూ కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టంగా భద్రత

అభ్యర్థులకు సూచనలివే..

- మంగళవారం ఉదయం 6 గంటల కల్లా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి కలెక్టర్/ఆర్‌వో ఇచ్చిన గుర్తింపు కార్డును కలిగి ఉండాలి.
- పార్టీ కార్యకర్తలను ఎవరిని కౌంటింగ్ కేంద్రాల వద్దకు తీసుకురాకూడదు
- కౌంటింగ్ కేంద్రాల బయట, రోడ్లపై విజయోత్సవ ర్యాలీలు నిషేధం. బాణసంచా కాల్చరాదు
- ఫంక్షన్ హాళ్లు, హోటళ్లలో జనసమీకరణ చేయకూడదు
- వాట్సాప్ గ్రూప్‌లు, ఇతర సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదు.
- ఇతర పార్టీ కార్యాలయాలు, నాయకుల ఇళ్ల వద్ద కవ్వింపు చర్యలకు దిగకూడదు.
- ఓడిపోయిన అభ్యర్థులపై వ్యంగ్య వ్యాఖ్యలు చేయకూడదు
- జూన్ 6వ తేదీ వరకు ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు చేయకూడదు.

ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, పక్కాగా నిర్వహించేందుకు పటిష్టంగా ఏర్పాట్లు చేశాం. లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఉంటుంది. పోలీసు బలగాలతో పాటు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేశాం. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరిగేందుకు అందరూ సహకరించాలి. గెలుపు, ఓటములు సహజమన్న విషయాన్ని గుర్తించి సంయమనం పాటించాలి. సోమవారం నుంచి 5వ తేదీ వరకు మద్యం షాపులను మూసివేస్తున్నాం. అభ్యర్థుల తరఫున కౌంటింగ్ ఏజెంట్లుగా వచ్చే వారికి ఆల్కహాల్ పరీక్ష నిర్వహిస్తాం. వాహనాల పార్కింగ్ కోసం లెక్కింపు కేంద్రాలవద్ద కౌంటింగ్ అధికారులకు, ఏజెంట్లకు వేర్వేరుగా పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేశాం.

– డా.రవిశంకర్ అయ్యన్నార్, నగర పోలీస్ కమిషనర్

నియోజకవర్గాల వారీగా.. పోలీస్ బందోబస్తు వివరాలు

కౌంటింగ్ కేంద్రం	సీఏపీఎఫ్	ఎస్ఏపీ	సివిల్ ఫోర్స్	సీసీ కెమెరాలు
ఈఈఈ బ్లాక్, న్యూ క్లాస్‌రూమ్ కాంప్లెక్స్	48	30	ఏడీసీపీ-1, ఏసీపీ-5, సీఐ-9, ఎస్ఐ-22, ఏఎస్ఐ,హెచ్‌సీ-18, పీసీలు-61, డబ్ల్యూపీసీ-19, ఏఆర్‌పీసీ-10, మొత్తం-144	80
కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ బ్లాక్	12	15	ఏడీసీపీ-1, ఏసీపీ-1, సీఐ-3, ఎస్ఐ-9, ఏఎస్ఐ,హెచ్‌సీ-8, పీసీలు-27, డబ్ల్యూపీసీ-9, ఏఆర్‌పీసీ-8, మొత్తం-66	24
ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ ఇంజనీరింగ్ బ్లాక్	12	10	ఏడీసీపీ-1, ఏసీపీ-1, సీఐ-3, ఎస్ఐ-9, ఏఎస్ఐ,హెచ్‌సీ-8, పీసీలు-27, డబ్ల్యూపీసీ-9, ఏఆర్‌పీసీ-8, మొత్తం-66	24
కెమికల్ ఇంజనీరింగ్ బ్లాక్	12	10	ఏడీసీపీ-1, ఏసీపీ-1, సీఐ-3, ఎస్ఐ-9, ఏఎస్ఐ,హెచ్‌సీ-8, పీసీలు-27, డబ్ల్యూపీసీ-9, ఏఆర్‌పీసీ-8, మొత్తం-66	24
మెయిన్ ఇంజనీరింగ్ బ్లాక్	12	10	ఏడీసీపీ-1, ఏసీపీ-3, సీఐ-6, ఎస్ఐ-18, ఏఎస్ఐ,హెచ్‌సీ-33, పీసీలు-69, డబ్ల్యూపీసీ-12, ఏఆర్‌పీసీ-2, మొత్తం-144 పెట్రోలింగ్ పార్టీలు-15	24

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం


పరిశీలకులకు ఏర్పాట్లను వివరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

పరిశీలకులకు వివరించిన జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు యంత్రాంగం తరఫున పటిష్ట ఏర్పాట్లు చేశామని, అధికారులకు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున కౌంటింగ్ పరిశీలకులకు వివరించారు. రిజర్వ్‌తో కలిపి 1,045 మందికి రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించామని, అందులో అవసరమైన 857 మందిని కేటాయించామని తెలిపారు. పరిశీలకులు, ఆర్వోలు, పోలీసు అధికారులతో కలిసి కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఇప్పటి వరకు చేసిన ఏర్పాట్లను పీపీటీ ద్వారా కలెక్టర్ వివరించారు. విశాఖ పార్లమెంట్ పరిధిలో పోలైన ఓట్లను లెక్కించేందుకు 7 కౌంటింగ్ కేంద్రాలను కేటాయించామని, అసెంబ్లీల పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు మరో 7 కేంద్రాల్ని కేటాయించామని చెప్పారు. అలాగే పోస్టల్ బ్యాలెట్లకు 6 కేంద్రాలను కేటాయించామని, ఈటీపీబీఎస్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నిమిత్తం మరో కేంద్రాన్ని కేటాయించామని వెల్లడించారు. పెందుర్తి, గాజువాక అసెంబ్లీ పరిధిలో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఆయా ఈవీఎంల కౌంటింగ్ కేంద్రాల్లోనే లెక్కిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకున్నామని, మూడంచెల భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నామని చెప్పారు. ప్రతి కేంద్రంలో 14 టేబుళ్ల ద్వారా లెక్కింపు ప్రక్రియ వేగవంతంగా జరిగేందుకు వీలుగా చర్యలు తీసుకున్నామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు తెల్లకాగితం, పెన్, పెన్సిల్ మాత్రమే తీసుకురావడానికి అనుమతి ఉందని సమావేశంలో భాగంగా స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రం లోపల సీసీ కెమెరాలు అమర్చామని, సీటింగ్ ఎరేంజ్‌మెంట్స్ కూడా చేశామని చెప్పారు. పార్కింగ్, ఇతర భద్రతాపరమైన చర్యల గురించి పోలీసు కమిషనర్ డా.ఎ. రవిశంకర్ వివరించారు. సమావేశంలో విశాఖ పార్లమెంటు, తూర్పు, దక్షిణ నియోజకవర్గాల కౌంటింగ్ పరిశీలకులు అమిత్ శర్మ, భీమిలి పరిశీలకులు అజయ్ కుమార్ మిశ్ర, ఉత్తర నియోజకవర్గ పరిశీలకులు అభిషేక్ అగర్వాల్, పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు అమిత్ కుమార్ పామాసి, గాజువాక పరిశీలకులు అమర్ సేన్ వామన్ రావు రాణె, పెందుర్తి పరిశీలకులు బీడీ దేవర, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జాయింట్ పోలీసు కమిషనర్ కె. ఫకీరప్ప, ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ, ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్ల తరలింపు

ఏయూక్యాంపస్: విశాఖ లోక్ సభ నియోజకవర్గం పరిధిలో పోలైన పోస్టల్ బ్యాలెట్లను ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోని ఈసీఈ బ్లాక్ నుంచి ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఫెసిలిటేషన్ కేంద్రాల నుంచి ఉద్యోగులు వేసిన పోస్టల్‌బ్యాలెట్ ఓట్లను ఎన్నికల అనంతరం ఏయూలోని ఈసీఈ బ్లాక్‌లో భద్రపరిచారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అనుగుణంగా ఆయా ఓట్లను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల సమక్షంలో విభజించి వాటిని ఆదివారం పటిష్ట భద్రత నడుమ ఆయా స్ట్రాంగ్ రూమ్లకు తీసుకువెళ్లారు. ఎస్.కోట పరిధిలో విశాఖ లోక్ సభ స్థానానికి పోలైన ఓట్లను కూడా ఆదివారం అక్కడ నుంచి ఇక్కడకి తీసుకువచ్చారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని రకాల చర్యలు తీసుకుని అభ్యర్థుల సమక్షంలో ప్రక్రియను నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. పార్లమెంట్ నియోజ కవర్గ కౌంటింగ్ అబ్జర్వర్ అమిత్ శర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కమిషనర్ కె.ఫకీరప్ప, ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, ఏఆర్వోలు, అభ్యర్థులు పాల్గొన్నారు.


కలెక్టర్ మల్లికార్జున సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌కు సీలు వేస్తున్న సిబ్బంది

కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్


ర్యాండమైజేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన సిబ్బందిని కేటాయిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కౌంటింగ్ అబ్జర్వర్లు, పోలీస్ కమిషనర్ డా.ఎ. రవిశంకర్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఇతర అధికారుల సమక్షంలో కలెక్టరేట్ వీసీ హాలులో ఆన్లైన్ విధానంలో కలెక్టర్ ఈ ప్రక్రియను నిర్వహించారు. రిజర్వ్‌తో కలిపి మొత్తం 1045 మందికి ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఇందులో లెక్కింపు ప్రక్రియను అవసరమైన 857 మంది సిబ్బందిని పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించారు. వారిలో కౌంటింగ్ సూపర్ వైజర్లు 267 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 309 మంది ఉండగా మైక్రో అబ్జర్వర్లు 281 మంది ఉన్నారు. వీరందరికీ మంగళవారం ఉదయం మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి ఎవరు ఏ టేబుల్‌కు వెళతారో ఆయా టేబుళ్లకు కేటాయిస్తారు.

పార్కింగ్ సదుపాయం ఇలా..

మద్దిలపాలెం : ఎన్నికల కౌంటింగ్ కేంద్రమైన ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో 16 ఎకరాలలో పార్కింగ్ కేటాయించామని ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గాలు వారీగా ప్రవేశాల ద్వారాలు కేటాయించామన్నారు. మీడియాకు ప్రత్యేక పార్కింగ్‌తోపాటు, మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు.

- తూర్పు, ఉత్తర, దక్షణకు మద్దిలపాలెం వైపు నుంచి తూర్పు, ఉత్తర, దక్షిణ నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులు, ఏజంట్లు మద్దిలపాలెం వైపు గల ఏయూ ఇంజనీరింగ్ ముఖ్యద్వారం నుంచి ప్రవేశించాలన్నారు. వీరికి కేటాయించిన పార్కింగ్ ప్రాంతాలో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు.
- గాజువాక, పశ్చిమ, పెందుర్తి నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజంట్ల త్రీటౌన్ వైపు నుంచి గల ప్రవేశం ద్వారా రావాలన్నారు. వారికి దగ్గరలో కేటాయించిన పార్కింగ్ ప్రాంతాలలో వాహనాలు పార్కింగ్ చేయలన్నారు.
- మద్దిలపాలెం నుంచి త్రీటౌన్ వైపు వెళ్లేందుకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మీదుగా వున్న రహదారిని సోమవారం అర్ధరాత్రి నుంచి మూసివేస్తున్నామన్నారు.


ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో పార్కింగ్ మ్యాప్

30 వసంతాల వేడుక


నాటి ఉపాధ్యాయులతో 1992-93 బ్యాచ్ విద్యార్థులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాల 1992-93 బ్యాచ్ విద్యార్థుల కలయిక ఆదివారం అడవివరంలోని ఒక ప్రైవేటు కల్యాణమండపంలో జరిగింది. పదోతరగతి పూర్తిచేసి 30 ఏళ్లు దాటడంతో 30 వసంతాల వేడుకని వైభవంగా నిర్వహించారు. ఆబ్యాచ్‌కు చెందిన 50 మంది విద్యార్థులు ఈకలయికలో పాల్గొని తమకు చదువుచెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. అప్పటి జ్ఞాపకాలను ఒకరికొకరు గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా ఆటపాటల్లో మునిగితేలారు. పిల్లలకు పలు ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. పూర్వ విద్యార్థులు సత్యవతి, నాగరాజకుమారి, సుజాత, చందన, బోర ప్రసాద్‌రెడ్డి, దామోదరరెడ్డి, పి.గోపాల్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్

నేటి కౌన్సెలింగ్ 6వ తేదీకి వాయిదా

మురళీనగర్ : జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో శనివారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా గైస్‌లో 92,500-1,00,000, ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 1,00,001-1,08,000, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 92,001-1,08,000 ర్యాంకుల విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. ఈ మూడు కేంద్రాల్లో 363 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు పరిశీలించారు. గైస్‌లో 136మంది, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 180 మంది, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 47మంది సర్టిఫికెట్లు పరిశీలనకు హాజరయ్యారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.

సోమవారం నిర్వహించాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 6వ తేదీకి వాయిదా వేశారు. ఎన్నికల ఫలితాలకు సంబంధించి మంగళవారం కౌంటింగ్ నిర్వహించనున్న కారణంగా సోమవారం నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఈ నేపథ్యంలో షెడ్యూలులో స్వల్ప మార్పులు చేసిన విషయం విదితమే. దీని ప్రకారం సోమవారం నిర్వహించాల్సిన కౌన్సిలింగ్ 6వ తేదీన నిర్వహిస్తారు. వెబ్ ఆప్షన్లు 7నుంచి 10తేదీ వరకు పెట్టుకోవాలి. 11న ఆప్షన్ల మార్పిడి, 13న సీట్ల కేటాయింపు,14నుంచి 19వరకు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది.


సర్టిఫికెట్ల పరిశీలిస్తున్న అధికారులు

ముగిసిన సహజసిద్ధ మామిడి పండ్ల సంత

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలో నిర్వహించిన మామిడి పండ్ల సంత ఆదివారం ముగిసింది. సహజ సిద్ధంగా పండించిన మామిడి పండ్లను విక్రయించేందుకు ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో ఈ ప్రత్యేక సంతను నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో సంత జరిగింది. ఈ సందర్భంగా కాలనీ వాసులు సంతకు తరలివచ్చి మామిడి పండ్లను కొనుగోలు చేశారు. విశాఖ గ్రామీణ ప్రాంతాలతో పాటు పలు చోట్ల ప్రకృతి వ్యవసాయం ద్వారా మామిడి పండ్లను పండించి ఇక్కడ విక్రయించినట్టు సంఘం వెల్లడించింది.

క్లుప్తంగా

50 వేల గాజులతో నూకాంబికకు అలంకరణ



గాజుల అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక బాలాలయంలో అమ్మవారికి ఆదివారం వైశాఖమాసం ఏకాదశి రేవతి నక్షత్రం సందర్భంగా 50 వేల గాజులతో అలంకరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పిల్లపాపలతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ పరిధిలో కొంతమంది భక్తులు తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూ కాంప్లెక్స్‌లన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులు దీరారు. వృద్ధులు, గర్భిణులకు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,550
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,500
వెండి(కిలో):	రూ.98,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.145
స్కిన్	: రూ.260
స్కిన్‌లెస్	: రూ.270

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	500.00
విజయనగరం	504.00
శ్రీకాకుళం	504.00

పిడుగుల వాన



పెదగదిలి వద్ద వరద నీటిలో వాహనాలు



నగరంలో ఉరుములు మెరుపులు

- భయకంపితులైన జనం
- నేడు, రేపు తేలికపాటి వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: ఒక పక్క జోరు వాన.. మరో పక్క పిడుగుల వాన..! వెరసి జనాన్ని తీవ్ర భయాందోళనలకు గురి చేశాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆదివారం ఉషోదయానికి ముందే ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. అవి క్రమంగా విస్తరించాక తొలుత తేలికపాటి జల్లులు కురిశాయి. ఆపై జడివాన హోరెత్తించింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులకు పిడుగులు కూడా జతకట్టాయి. ఫెళఫెళమని శబ్దాలతో చెవులు చిల్లుపడేటంతలా పలుచోట్ల పిడుగులు సంభవించాయి. ఇలా గంటకు పైగా జోరు వాన, పిడుగులతో ప్రజలు భయకంపితులయ్యారు. ఆదివారం ఉదయం ఒక్క విశాఖపట్నంలోనే 36 భారీ పిడుగులు నమోదయ్యాయి. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోనూ మరిన్ని పిడుగులు దడపుట్టించాయి. పిడుగుల ధాటికి విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఒకరు, పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో మరొకరు మృత్యువాత పడ్డారు. వీరిద్దరూ మత్స్యకారులే కావడం గమనార్హం. కాగా ఉపరితల ఆవర్తనంతో పాటు నైరుతి రుతుపవనాలు ఉత్తర కోస్తాకు విస్తరించనున్న నేపథ్యంలో రానున్న మూడు రోజులు ఉమ్మడి విశాఖ జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, అదే సమయంలో పిడుగులు కూడా సంభవిస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. పిడుగుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సునంద హెచ్చరించారు.

బీఆర్‌టీఎస్‌పై నిలిచిన వరద నీరు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి ఆదివారం వరద నీటితో నిండిపోయింది. ఉదయం కురిసిన వర్షానికి పెదగదిలి కొండవాలు నుంచి ఇక్కడకు వరద నీరు చేరింది. ఇక్కడ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురిసిన ప్రతీ సారి ఇక్కడ ఇదే పరిస్థితి నెలకుంటోందని స్థానికులు చెబుతున్నారు. శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సేవామార్గంలో పొంగిన గెడ్డ

మల్కాపురం: భారీ వర్షానికి 61వ వార్డు మరిడిమాంబ కల్యాణ మండపానికి సమీపంలోని గెడ్డ పొంగింది. గెడ్డలో రెండు వారాల నుండి పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి. వీటిని సకాలంలో తొలగించక పోవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వర్షపు నీరు పోయే మార్గం లేకపోయింది. దీంతో సేవా మార్గం, మరిడిమాంబ ఆలయం వరకు మురుగు నీరు నిలిచిపోయింది. ఆలయానికి సమీపంలోని నివాసితులు ఇబ్బందులకు గురయ్యారు.



75 ఫీట్ రహదారిలో చేరిన నీరు

నీట మునిగిన పాతనగరం

జగదాంబ: భారీ వర్షానికి పాతనగరంలో రహదారులు నీటిమునిగాయి. పోర్టు దరి హార్బర్ స్టేషన్ వద్ద రహదారి వర్షపు నీటితో నిండిపోయింది. రామకృష్ణ జంక్షన్, 75 ఫీట్‌రోడ్డు జనతాబజార్ రహదారి, బౌడారా రోడ్డు, పూర్ణామార్కెట్, వెలంపేట ఇలా అన్ని రహదారులు నీటమునిగాయి.



గెడ్డ పొంగి సేవా మార్గంపై వచ్చిన వ్యర్థాలను కర్రసాయంతో తొలగిస్తున్న వ్యక్తి



నీటమునిగిన ఫ్రూట్ మార్కెట్ రహదారి

కారుపై కూలిన చెట్టు



నందగిరినగర్‌లో కారుపై కూలిన చెట్టు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు నందగిరినగర్ కృష్ణుడు గుడి రోడ్‌లో ఆదివారం ఉదయం చెట్టుకూలిపోయింది. ఉదయం వర్షం కురుస్తుండగా రోడ్డు పక్కన ఉన్న చెట్టు అమాంతంగా కూలిపోవడంతో జనం పరుగులు తీశారు. రోడ్డుపై పార్కింగ్ చేసిన కారుపై చెట్టుపడటంతో ముందు భాగం దెబ్బతింది. ఆదివారం కావడంతో అక్కడే చేపలు విక్రయిస్తున్న మహిళలు ఈ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. నిత్యం జనం రాకపోకలతో రద్దీగా ఉండే మార్గంలో చెట్టు కూలడం, ఎవరికీ ఎటువంటి నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి

దాబాగార్డెన్స్: ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం ఉదయం పిడుగుపడి ఓ యువకుడు మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో మరో యువకుడు కోమాలోకి వెళ్లిపోయాడు. మరో ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాలివీ.. ఆదివారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. జెట్టీ నంబర్ 4కు సమీపం(ఫిషింగ్ హార్బర్)లో తెప్పపై కొత్త అగ్రహారం వీధికి చెందిన దుమ్ము సత్యారావు, తన కుమారుడు పోలరాజుతో పాటు మైలపల్లి గురువాజీ, కారె అప్పన్న, మైలపల్లి గురయ్య పనులు చేసుకుంటున్నారు. వీరి తెప్పకు కొద్ది అడుగుల దూరంలో పిడుగు పడడంతో దుమ్ము పోలరాజు(23) మృతి చెందాడు. ఇదే ఘటనలో మైలపల్లి గురువాజి కోమాలోకి వెళ్లిపోయాడు. అతను ప్రస్తుతం ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మైలపల్లి గురయ్య, కారె అప్పన్న, దుమ్ము సత్యారావు ప్రాణాలతో బయటపడ్డారు. సంఘటన స్థలికి వన్‌టౌన్ పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.



పోలరాజు (ఫైల్)

మార్చురీ వద్ద మిన్నంటిన రోదనలు

పోస్టుమార్టం కోసం పోలరాజు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. ఈ విషయం తెలియడంతో పెద్ద ఎత్తున మత్స్యకారులంతా అక్కడకు చేరుకున్నారు. వారి రోదనలతో ఆ ప్రాంతం మిన్నంటింది. సత్యారావు దంపతులకు పోలరాజు ఒక్కడే సంతానం. వచ్చే ఏడాది వివాహం చేసే ప్రయత్నంలో ఉన్నారు. ఇంతలోనే ఈ ఘోరం జరిగిపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.



మార్చురీ వద్ద రోదిస్తున్న పోలరాజు తల్లి, బంధువులు

పరవాడలో విషాదం



ముత్యాలు మృతదేహం

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు జాలరిపేటకు చెందిన కంబాల ముత్యాలు (48) పిడుగుపాటుకు గురై ఆదివారం ఉదయం మృతి చెందాడు. సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపిన వివరాలివీ.. ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో నిలిపిన పడవ, ఇంజిన్, వలలను సురక్షితంగా తరలించడానికి ఉదయం ముత్యాలు వెళ్లాడు. ఆ సమయంలో ముత్యాలుపై పిడుగు పడడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నూకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'దర్శిని' బృందానికి అభినందనలు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం దర్శిని సినిమా బృందం అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, రంగసాయి మీడియా సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దర్శకులు, నటీనటులను ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగర యువ దర్శకుడు, నటులు ఇక్కడ పరిసర ప్రాంతాల్లో పూర్తిగా నిర్మించిన చిత్రం దర్శిని అని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల విడుదలై ఆదరణ పొందుతోందన్నారు. విశాఖలో సినీ పరిశ్రమ అభివృద్ధికి అన్ని వనరులు ఉన్నాయని, ప్రభుత్వాలు చొరవ తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. చిన్న చిన్న సినిమాలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం దర్శకుడు ప్రదీప్ అల్లు, నిర్మాత ఎల్.వి.సూర్యం, సహాయ దర్శకుడు కె.సంతోష్, నటులు ఎస్.వి.సత్యప్రసాద్, నవీన్, సౌండ్ ఇన్‌చార్జి వేదరాము, సిద్ధార్థలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దర్శిని చిత్రాన్ని ప్రదర్శించి, నటీ నటులతో ముఖాముఖి నిర్వహించారు. రంగసాయి మీడియా ప్రతినిధి బాదంగీర్ సాయి, సీనియర్ జర్నలిస్ట్ ఎస్.నాగేశ్వరరావు, హేమ, జమ్మా చిన్నబాబు, సొసైటీ ప్రతినిధులు బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావు, రెడ్డి, ఉషారాణి, ప్రభు పాల్గొన్నారు.



సినిమా బృందాన్ని సత్కరిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

భద్రత కట్టుదిట్టం

జాయింట్ పోలీసు కమిషనర్ ఫకీరప్ప

మద్దిలపాలెం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియను కట్టుదిట్టమైన భద్రత నడమగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని నగర జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప అన్నారు. కౌంటింగ్ భద్రతపై ఆదివారం ఆయన ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని రక్షణ ఏర్పాట్లు చేశామన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. దీనికి సంబంధించి నగరాన్ని, అసెంబ్లీ నియోజకవర్గాలను పోలీసులు పహారాలో ఉండేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

నగరంలో 91 సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించామని జాయింట్ సీపీ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో 79 పెట్రోలింగ్ పార్టీలు పర్యవేక్షణ చేయనున్నాయన్నారు. వీటితో పాటు గస్తీ బృందాలు సంచరిస్తాయన్నారు. అల్లర్లు జరగకుండా 137 పికెట్స్ ఏర్పాటు చేశామన్నారు.

- నగరంలో 650 మంది రౌడీ షీటర్లను గుర్తించామన్నారు. వీరిని హౌస్ అరెస్టు చేశామన్నారు.
- ముఖ్యమైన నాయకులకు, అభ్యర్థులకు షాడో టీంలు ఏర్పాటు చేశామన్నారు.
- బాడీ వోర్న్ కెమెరాలతో సిబ్బందిని నియమించి వాటిని పోలీసు కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామని పేర్కొన్నారు. 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద అనధికారులు ప్రవేశించకుండా 3 ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. .
- కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు.

● సండే సందడి



ఆర్.కె.బీచ్‌కు పోటెత్తిన సందర్శకులు

ఆదివారం పైగా చాలా రోజుల తర్వాత వాతవరణం చల్లగా ఉండటంతో నగరవాసులు పర్యటక ప్రాంతాల్లో సందడి చేశారు. వేసవి సెలవులు కావడంతో బీచ్‌లు, పార్క్‌ల్లో పిల్లల తోసహా తల్లిదండ్రులు ఆనందంగా గడిపారు. ముఖ్యంగా సాగరతీరంలో పిల్లలు, యువతీ యువకులు స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. –బీచ్‌రోడ్డు

అతిథుల కోసం ఆవకాయ





మామిడి ముక్కలను మిక్సింగ్ చేస్తున్న సందర్శకులు

బీచ్‌రోడ్డులోని నోవాటెల్‌లో ఆంధ్ర ఆవకాయ పేరుతో ఆదివారం ఓ కార్యక్రమం నిర్వహించారు. మామిడి కాయ ముక్కలు, కారం, నూనె, ఇతర పదార్థాలను మిక్సింగ్ చేసి నోరూరించే ఆవకాయను సిద్ధం చేశారు. ఈ ఆవకాయను జాడీల్లో నింపి నిల్వ చేశారు. నోవాటెల్‌కు వచ్చే అతిథులకు ఈ ఆవకాయ రుచిని చూపించనున్నారు. చిన్నారులు, యువతీ యువకులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. - బీచ్‌రోడ్డు